కథానిక:

# ★ శాస్త్రి ★

ఎన్. సి. సత్యనారాయణాచార్య.

కాఫీ పూర్తిచేసి, పేపర్లో పేజీలు తిరగేస్తూ కూర్చున్నాను. యింతలో పక్కింటి శివయ్య గారు తుఫానులాగా, నాగదిలోకొచ్చి, కుర్చీ కేసి గుడ్లురిమిచూసి, దాన్ని నాదగ్గరగాలాక్కుని కూర్చున్నారు. గొప్పసంగతేదో జరిగుంటుందను కున్నాను.

"అబ్బబ్బ! యింటాయనండీ!"

"ఏమైంది? ఏంచేశాడేమిటి?"

"అదే, కరెంటువిషయం. మనంచాలా కరెంటువాడేస్తున్నాంట. యిక్కణ్ణించి పదింటికే లైట్లార్పేస్తాట్ట. ఏడింటినించి పదింటివరకే. మళ్లీ తెల్లారకట్టకూడా ఉండవు. పిల్లలకి పరీక్షలు దగ్గరకొస్తున్నాయి. లైట్లుంటేనే కునికిపాట్లు పడే బడుద్ధాయిలకి లైట్లు ఆర్పేస్తే యింకవేరే చెప్పాలా?"

"ఏమో, తెలియకుండావుంది. ఏదో ఒకటి చెయ్యాలి."

"ఎవర్నడిగినా అదే సమాధానం. ప్రతీవాడు పిల్లికి గంటకట్టమనేవాడే. ఎవరూముందుకిరారు."

నిజమేమరి ఎవరన్నా ఆయన ఎదుట 'కంప్లెయిన్' చేస్తే "యిల్లు కాళీచేసెయ్యండి. మీరంత కష్టపడి యింట్లో ఉండక్కర్లేదు." అంటాడు. అప్పుడు మేమే బ్రతిమాలాల్సి వచ్చేది. తర్వాతొచ్చి అద్దెలో నూటికి పదివొంతున పెంచించాడు. మేమంతా అడ్డు పడ్డాం; అడిగితే రిపేర్లన్నాడు. నేడో రేపో కూలి పోయేలాగున్నదానికి రిపేర్లట! తర్వాత నీళ్ళట్టే వాడొద్దన్నాడు. ఇప్పుడు ఎలక్ట్రిసిటీకి కూడా వచ్చింది తికమకలు,

అది రోడ్డుకంటే పల్లంగా ఉన్న ఒక యిల్లు అందులో మొత్తం పది వాటాలవాళ్లం ఉన్నాం. వర్షంవస్తే గిన్నెలూ మంచాలూ నీళ్లలో తేల్తాయి. యింక పెంకులంటారా, సూర్యచంద్రులకీ, గాలివానలకీ కూడా ఆశ్రయమిస్తున్న ఉదారస్వభావులు. మరోచోట ఎక్కడా కూడా యిళ్లు దొరక్కపోడంచేత యింకగత్యంతరం లేక ఈ యిల్లే ఆశ్రయించాల్సి వచ్చింది.

"మనమంతా ఒక్కుమ్మడిగా యింటాయన దగ్గరకెళ్లి మనవి చేసుకుందాం." అని శివయ్యకి సలహా యిచ్చాను.

"ఇలాంటివి చాలాసార్లు చూశాం" అని శివయ్య పెదవి విరిచాడు.

"ప్రయత్నించి చూద్దాం. యింతలో మనకి మునిగి పోయిందేమీలేదు." అన్నాను.

పది వాటాలవాళ్లం యింటాయన ముందు హాజరయ్యాం.

"ఏమిటిదంతా?"

"ఏమీలేదు... మీరు కరెంటునిగురించి...

నీళ్లునమిలాను.

"ఏమిటి—అయితే?"

"అది అంత సబబుగాలేదు."

"అయితే మీరు యిల్లుకాళీ చెయ్యొచ్చు."

"కుదరదండి."

"ఇలాచూడండి నేనిప్పుడు ఒక్క చిన్న భాగం కట్టించడానికి ఆరువేల రూపాయలు దగ్గర పెట్టుకున్నాను. మీకేం తెలుసు యిళ్లవిలువ? మీరిచ్చే ముష్టి రూపాయలకీ యిల్లు వాడుకునేదిగాక పైగా కంప్లెయింటులు! నేను గాబట్టి..."

"కాని..."

"కానీలేదు. గీనీలేదు. ఇంకవెళ్లొచ్చు. కేసు పెట్టానంటే..." వాక్యం పూర్తికాక ముందే పలాయనం చిత్తగించాం. మాలో ఎవడికీకోర్టు కెక్కే తాహతులేదు.

ఆ వేళ మధ్యాహ్నం మా స్నేహితుడు ప్రసాద్ వచ్చాడు. వాడిది మహా తెలివైన బుర్ర. నేను వాడికి మా యింటాయన పెట్టే కష్టాలన్నీ పూస గుచ్చినట్లు చెప్పాను.

"ధన్, యింతేనా అయితే మీవాళ్ళందర్నీ అర్జంటుగా రహస్య సమావేశానిక్కి హాజరవ్వమని చెప్పు. నేనుదానికి అధ్యక్షత వహిస్తాన్లే." అన్నాడు.

సమావేశానిక్కి హాజరయ్యాం. చెవులొగ్గి అతని ప్లానంతా శ్రద్ధగా విన్నాం. సంతోషంతో ఒక్క ఎగురు ఎగిరాం.

* * *

అర్ధరాత్రి. యింటాయన గురక హోరువిన వస్తోంది. అంతా మా మా నియమితస్థానాలు 'ఎటెంషన్' పొజిషన్లో నించున్నాము. యింటాయన కిటికీదగ్గిర నల్లటిముసుగేసుకుని ప్రసాద్ నించున్నాడు. పన్నెండున్నరయింది. ఒక్కసారిగా ప్రసాద్, "దొంగ! దొంగ!" అని కెవ్వుమని కేకవేశాడు.

యింటాయన లైట్లు వేసి తలుపు తెరచాడు. ఒక కర్ర చేత బుచ్చుకుని యివతలికి వచ్చాడు ప్రసాద్ యింటాయన ముందుగా పరిగెత్తాడు. యింటాయన అనుసరించాడు: కాస్సేపు ఏదో గోలయించి ప్రసాద్ దూరంగా ఒక ముసుగు మనిషిని చేతులూ కాళ్లూ కట్టిపడేసి, "దొంగ! దొంగ!" అని కేకేసి పొదలోకి మాయమయ్యాడు.

అదే మాకుగుర్తు మేమక్కడికి పరిగెత్తాం. శివయ్య, "అడుగో, దొంగ!" అన్నాడు. అక్కడ ఆముసుగుమనిషి తన్నుకుంటూ, నానా గోల చేస్తున్నాడు.

"తన్నండి వెధవని" అన్నానేను.

అందరం వాణ్ణితన్ని, గుద్ది, నానా హంగామా చేసి, వాడికి పులుసులోకి ఎమిక లేకుండా చేశాం వాడికి పెట్టవలసిన శాపనార్థాలన్నీ పెట్టాం. ఒక పిప్పళ్ల బస్తాలాగ యింకా ముసుగులోనే కూలబడాడు.

'సరేగాని వెధవని ముసుగు తీసెయ్యండి' అన్నాడొకాయన.

ఎలాగో కష్టంమీద ముసుగు ఊడదీశాం. అతడు మావంక నీరసంగా చూశాడు.

'అరెరే! యింటాయనరా!'

'ఏమిటీ ! యింటాయనే దొంగా?'

'ఆశ్చర్యం! యింటాయనే ముసుగుమనిషి!'

'కాదు. యిల్లు దోపిడీ చేసేరకం. పోలీసులకి రిపోర్టు చేద్దాం.'

పదిమందీ చెప్తున్న మాటలతో యింటాయన నీరసపడై పోయాడు పోలీసు మాటవినగానే ఆయన శరీరంలో విద్యుచ్ఛక్తి ప్రవహించింది.

'లేదండీ, ఒక ముసుగుమనిషిని వెంటాడాను. వాడు నన్నుపడేసి ఆముసుగు నాకు కట్టేసి వెళ్లిపోయాడు' అని చెప్పటం మొదలెట్టాడు.

"అబ్బే! అదాకథ!" పెదిమలు విరిచాం.

'ఏమిటిక్కడ గోల?' ఒక పోలీసు ప్రవేశించాడు. ఆయెర్రటోపీ చూడగానే యింటాయన జుర్రున లేచి నుంచున్నాడు.

'ఈయన మాయిల్లు దోపిడీ చెయ్యడానికి ప్రయత్నించాడు' అన్నాను.

'అయితే ఛార్జి యిస్తారా?'

'ఆ, ఆయన మాయింటాయన అయినప్పటికీ, ఛార్జియివ్వాల్సివస్తోంది' అన్నాడు శివయ్య.

యింటాయన వణుకుతున్న చేతులతో, 'మీరే దడిగితే అదిచేస్తాను. నన్ను పోలీసుల్నించి రక్షించండి. పోలీసు గొడవలు నా మాన మర్యాదల్ని మంటగలుపుతాయి గౌరవంగా బ్రతికినవాణ్ణి.' అని దైర్యంగా ప్రార్థించాడు.

పోలీసువాణ్ణి తతిమ్మా వాళ్లని వేరేగా చేరదీసి, ఏమేమో మాట్లాడి మళ్లీ యింటాయన దగ్గిరొక్కొచ్చాను.

'మీదగ్గిర డబ్బుబాగా నిల్వ ఉందిగా! ఆ పోలీసుముఖాన రెండు వందలు పారెయ్యండి. మాకునీటివిషయంలోనూ, కరెంటువిషయంలోనూ ఎలాంటి కష్టాలూ కలిగించకండి'.

యింటాయన ఒప్పుకున్నాడు. అంతా మధ్యాహ్నంప్లాను ప్రకారం సక్రమంగానే నడిచింది. పోలీసు ఓరగా చూసి చిరునవ్వు నవ్వాడు. పోలీసు వేషం మా ప్రసాద్ సక్రమంగా నిర్వహించాడు!!